క్లుప్తంగా

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



సవేరా కేంద్రం వద్ద గ్యాస్ కనెక్షన్లు అందుకున్న లబ్ధిదారులు

ఆరిలోవ: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన పథకం ద్వారా మహిళా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో సవేరా హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో 20 మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ అధినేత మొల్లి నిర్మల కుమారి మాట్లాడుతూ మొదటి విడతలో 20 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనక్షన్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజెన్సీ మేనేజర్ నమ్మి గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అమర జవాన్ల పిల్లలకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ



చిన్నారులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న సైనిక సంక్షేమ అధికారులు

ఏయూక్యాంపస్: అమర జవాన్ల పిల్లలకు ముంబైకు చెందిన అథర్వ ఫౌండేషన్ వారు ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. లాసన్స్ బే కాలనీలోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన ఐదుగురు అమర జవాన్ల పిల్లలకు వాటిని అందజేశారు. చిన్నారుల విద్యకు ఉపయుక్తంగా నిలిచేలా, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపుతూ బాసటగా ఉండేలా అథర్వ ఫౌండేషన్ వీటిని పంపిణీ చేసింది. కార్యక్రమంలో కల్నల్ సుధీర్ రాజి, బాలాజీ షిండే, లెఫ్టినెంట్ కల్నల్ భాషా, జి.సత్యానందం, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన



దాతలను సత్కరిస్తున్న ఈవో గాయత్రి, పాలక మండలి సభ్యులు

ఏయూక్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయంలో నూతనంగా ఆర్చ్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రస్తుతం ఆలయంలో కల్యాణ మండపానికి వెళ్లే మార్గాన్ని మరింత విశాలం చేస్తూ దాతల సహాయంతో ఆర్చ్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా దాతలు యంపాడ రాజేశ్వరరెడ్డి, ప్రసాదరెడ్డిని దేవస్థానం ఈవో కె.గాయత్రి, పాలక మండలి సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, సభ్యులు ఎం.మంగరాజు, ఎస్.కృష్ణమోహన్, ఎస్.నైటమ్మ, జెం.నాగమణి, ఎం.ఎస్.రవణమ్మ, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఐఐఏఎంలో 'పినాకిల్-2023' సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం)లో శుక్రవారం పినాకిల్-2023 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డబ్ల్యూఎన్ఎస్ సెంటర్ హెడ్(విశాఖపట్నం) ఆర్.ఎల్.నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. ఏకాగ్రత, క్రమశిక్షణతోపాటు విభిన్న అంశాలపై నైపుణ్యం, అవగాహన పెంచుకోవడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ దిశగా యువత శ్రమించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ సుంకర రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేడీపీఎం పాఠశాల వివరాలు

పాఠశాలలో విద్యార్థులు	బోధన సిబ్బంది	బోధనేతర సిబ్బంది	సహాయక సిబ్బంది	ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్)	స్మార్ట్ క్లాస్ రూమ్	కొత్తగా కొనుగోలు చేసిన ఫ్యాన్లు	డ్యూయల్ డెస్క్ బెంచీలు	అల్మారాలు	గ్రీన్ బోర్డులు
800	27	3	3	19	1	68	80	6	15

చదువుల ప్రాంగణం.. సరికొత్త సొయగం



తరగతి గదిలో డెస్క్ బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నాడు–నేడు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల దశదిశలను మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన సర్కారు బడులు చిన్నారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రభుత్వ పాఠశాలలు దేనికీ తక్కువ కాదు అనే విధంగా సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి.
– ఏయూక్యాంపస్

ఇది కదా అభివృద్ధి



కేడీపీఎం పాఠశాల భవనం



పాఠశాల భవన సముదాయం



ఆధునికీకరించిన టాయిలెట్స్ బ్లాక్

- రూ. 56 లక్షలతో కేడీపీఎం పాఠశాలకు నూతన హంగులు
- 'నాడు–నేడు'తో మారిన స్వరూపం
- విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం



తాగునీటి పరికరం

విద్యార్థులు సంతోషంగా ఉన్నారు



పాఠశాలలో అవసరమైన అన్ని వసతులు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించడం సాధ్యపడింది. నాడు–నేడు నిధులతో పాఠశాలకు అవసరమైన అన్ని వసతులు సమకూరాయి. పాఠశాల పరిసరాలు, వసతులు అందంగా రూపొందాయి.

–సుమతీభాయి, ప్రధానోపాధ్యాయురాలు

అన్ని వసతులు సమకూరాయి



విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూరాయి. నాడు –నేడు పథకంలో పాఠశాలను అభివృద్ధి చేసిన విధానం అభినందనీయం. నేను గతంలో అదే పాఠశాలలో చదివాను. ప్రభుత్వం అందించిన నిధులతో పాఠశాల ఆవరణ, తరగతి గదుల్లో మౌలిక వసతుల కల్పన చేసిన విధానం బాగుంది.

–డి.లక్ష్మీపతి, పూర్వ విద్యార్థి, కేడీపీఎం పాఠశాల

కేడీపీఎం పాఠశాలలో నాడు–నేడు పథకంలో భాగంగా మొదటి దశలో మొత్తం 7 రకాల పనులు నిర్వహించారు. ప్రభుత్వం దీని కోసం రూ. 56.45 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో మంచినీటి సదుపాయం, విద్యుత్, టాయిలెట్ల మరమ్మతులు, ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, తరగతి గదులు, పాఠశాల గోడలపై అందమైన బొమ్మలు, ఇతర మరమ్మతు పనులు పూర్తి చేశారు. బెంచీలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో ఆధునికంగా ఏర్పాటైన బెంచీలపై కూర్చుని హాయిగా పాఠాలు వినే అవకాశం కలిగింది. నాణ్యమైన పోషకాహారం, జగనన్న విద్యా కానుక రూపంలో పుస్తకాలు, బ్యాగ్, బూట్లు ఇవ్వడంతో విద్యార్థులు సంతోషంగా విద్యనభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులకు సైతం ఆర్థిక భారం లేకపోవడంతో తమ చిన్నారులను పాఠశాలకు తప్పనిసరిగా పంపుతున్నారు.

పాఠశాల ఆధునికీకరణ.. చేసిన ఖర్చు

- ఎలక్ట్రికల్ వస్తువులు, వైరింగ్, మరమ్మతులకు రూ.7.56 లక్షలు
- టాయిలెట్ల మరమ్మతులు, నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు రూ.9.15 లక్షలు
- మంచినీటి సరఫరా వ్యవస్థకు రూ. 7.55 లక్షలు
- సివిల్ మేజర్, మైనర్ రిపేర్లకు రూ.12.74 లక్షలు
- గ్రీన్ బోర్డులకు రూ.1.54 లక్షలు
- ఫర్నిచర్‌కు రూ.7.68 లక్షలు
- వాల్ పెయింటింగ్స్ కోసం రూ.10.23 లక్షలు



పాఠశాల గోడలపై చిత్రించిన బొమ్మలు

'స్వచ్ఛ ప్రమాణ్'పై విద్యార్థులకు అవగాహన

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు కేఆర్‌ఎం కాలనీలోని శివశంకర్ విద్యా మందిర్‌లో శుక్రవారం స్వచ్ఛ ప్రమాణ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ హెచ్‌ఎం ఎం.వి.సుధ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి విద్యార్థులకు స్వచ్ఛ ప్రమాణ్‌పై సూచనలిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రుల శ్రద్ధ వహించాలని సూచించారు.



శివశంకర్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గుడ్ల సత్యారెడ్డి, ఉపాధ్యాయులు

కేడీపీఎం, నౌకానగర్ పాఠశాలల్లో..

ఏయూక్యాంపస్: జీవీఎంసీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎకో వైజాగ్–స్వచ్ఛ ప్రమాణ్ కార్యక్రమంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. 20వ వార్డు కేడీపీఎం పాఠశాల, నౌకానగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి పాల్గొని విద్యార్థులకు సూచనలిచ్చారు. ఎకో వైజాగ్ లక్ష్యాలను సాధించడం, వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం కన్వీనర్లు పద్మజ, పద్మ, రవణమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల్లో గణిత దినోత్సవం

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం దుర్గాభవాని, గణిత ఉపాధ్యాయులు నివాళులర్పించారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులు గణిత పదాలు, సింబల్స్‌తో వేసిన ముగ్గులు ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. పలు గణిత సూత్రాలతో కూడిన చార్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ గణిత శాస్త్ర ప్రాధాన్యాన్ని వివరించారు. శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన ఆవిష్కరణల గురించి తెలిపారు.

- విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ విద్యార్థులు ముగ్గులు వేసి, గణిత సూత్రాలతో కూడిన చార్టులు ప్రదర్శించారు.



గణిత పదాలతో విద్యార్థులు వేసిన ముగ్గును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

గణితంపై పట్టు సాధించాలి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల కంటే గణితం విభిన్నమైనదన్నారు. మ్యాథ్స్‌పై పట్టు సాధించడం ద్వారా లెక్కలతోపాటు భౌగోళిక అంశాలపై పరిజ్ఞానం లభిస్తుందన్నారు. గణితాన్ని ఇష్టంతో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గణిత అధ్యాపకుడు బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'వాకర్స్ మహా సమ్మేళనం'

బీచ్‌రోడ్డు: విశాఖ సాగర తీరాన శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ మహా సమ్మేళన సదస్సును విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు ఎస్.పి.రవీంద్ర పిలుపునిచ్చారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నడవండి–నడిపించండి' అనే నినాదంతో 1986లో స్థాపించిన తమ సంస్థ నేడు దేశవిదేశాల్లో 1,650 శాఖలు, 2.5 లక్షల సభ్యులతో విస్తరించిందని తెలిపారు. కన్వెన్షన్ చైర్మన్ రోలండ్ విలియమ్స్ మాట్లాడుతూ వాకర్స్ మహోద్యమ చరిత్రలో అత్యుత్తమ సేవలందించి, విశేష ప్రతిభ చూపిన వాకర్స్ క్లబ్స్ అధినేతలకు ఉత్తమ సేవా ప్రతిభా పురస్కారంతో జ్ఞాపికలు అందిస్తున్నామన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి 2 వేల మంది ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కార్యక్రమంలో కన్వెన్షన్ వైస్ చైర్మన్ కమల్ బైడ్, విజయా రవీంద్ర, కె.ద్వారకానాథ్, రాంజీ, ఉప్పలపాటి శుభ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు

ఏయూను సందర్శించిన ఐఐఆర్ఎస్ విద్యార్థుల బృందం



ఇన్‌చార్జి వీసీ సమతతో విద్యార్థుల బృందం

ఎంవీపీకాలనీ: డెహ్రాడూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఐఆర్ఎస్)కు చెందిన 13 మంది విద్యార్థుల బృందం శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఐఐఆర్ఎస్‌లోని సెంటర్ ఫర్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ ఇన్ ఆసియా పసిఫిక్(సీఎస్ఎస్‌టీఈఏపీ)లో రీసెర్చ్ విద్యార్థులైన వీరంతా తొలుతా ఏయూలోని ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించి అక్కడ ఆచార్యులతో పలు అంశాలపై చర్చించారు. ఏయూ టెక్ సెంటర్‌తో కేంద్ర ప్రభుత్వం, ఐక్య రాజ్య సమితి మధ్య అవగాహన ఒప్పందంలో భాగంగా వీరు ఏయూను సందర్శించారు. అంతరిక్ష శాస్త్రంలో సాంకేతికత, అప్లికేషన్ ప్రోగ్రామ్స్‌లో ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారాన్ని మెరుగుపరుచుకోవడంపై చర్చించారు. అనంతరం ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతతో ఆరుగురు విదేశీ విద్యార్థులతో కూడిన ఈ 13 మంది విద్యార్థులు బృందం మర్యాదపూర్వకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా వారికి ఆచార్య సమత అభినందనలు తెలిపారు. మూడు రోజుల పాటు వీరి పర్యటన కొనసాగనున్నట్లు ఏయూ ఫిజిక్స్ విభాగాధిపతి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థుల తులసి పూజ



తులసి పూజలు చేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ : యోగ వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆరిలోవ భారతీ విద్యానికేతన్‌లో తులసి పూజ, గీతా జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తులసి మొక్కలకు పూల దండలు వేసి హారతి ఇచ్చారు. నిర్వాహకులు ఆశారాం బాపు, కుశ్వంత్‌కుమార్, అపర్ణ తులసి పూజల గురించి విద్యార్థులకు వివరించారు. ఏ రోజుల్లో తులసి పూజ చేయాలి, వాటి ఆకులు తినడం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలు వివరించారు. అనంతరం గీతా జయంతిని ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన నీతి, గీతోపదేశం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి రావు, నిర్వాహకులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.


నృత్యరూపకం.. అద్భుతం

మద్దిలపాలెం: అర్ధశాంకరం కూచిపూడి నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శివపార్వతులను సాక్షాత్కరింపజేసేలా అద్వితీయంగా నాట్యం చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కళాభారతి డ్యాన్స్ ఫెస్టివల్–2023 ప్రారంభమైంది. ఈ వేడుకలను ముఖ్య అతిథిగా స్వామి శ్యాసంవేద్యనంద మహారాజ్ , వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబు, పైడా క్రిష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య గురువు వాడంటే కిరణ్ శిష్య బృందం ప్రదర్శించిన అర్ధశాంకరం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం కనువిందుగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్ఆర్‌కే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత మంతెన సత్యనారాయణరాజు సౌజన్యంలో ప్రదర్శించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.



అర్ధశాంకరం కూచిపూడి నృత్యరూపకంలోని సన్నివేశం

కోటి పుణ్యాల సాటి.. ముక్కోటి ఏకాదశి



ప్రత్యేక అలంకరణలో వెంకన్న



విద్యుత్ కాంతుల్లో వేంకటేశ్వర స్వామి ఆలయం

- పెదవాల్తేరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

ఏయూక్యాంపస్: కోటి పుణ్యాల సాటి ముక్కోటి ఏకాదశి. నేడు పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వారంలో భక్తులు దర్శించుకోనున్నారు. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఆలయ అధికారులు పూర్తి చేశారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేకంగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం వేంకటేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుంటారు. గత సంవత్సరం వటపత్ర సాయి అవతారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సంవత్సరం వేంకటేశ్వర స్వామి రామావతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శనివారం తెల్లవారు జాము 4 గంటల నుంచి స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. శనివారం, ఏకాదశి తిథి కలిసి రావడంతో వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆరిలోవ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పదమూడో వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వార్డులో శ్రీకాంత్‌నగర్, లక్ష్మీనగర్, గణేష్‌నగర్‌లలో ఇంటింటికీ వెళ్లి స్థానికులను పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో అందుతున్న సంక్షేమ పథకాలు పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, వరలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.




శ్రీకాంత్‌నగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

17,505 గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ మీటర్లు

సీతంపేట(పార్వతీపురం) : ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 3,761 గిరిజన గ్రామాల్లో 17,505 గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డైరెక్టర్ (ప్రాజెక్టులు) ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీలో పీవీటీజీ గిరిజనులకు ఎన్ని కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లేవనేదానిపై సర్వేచేస్తున్నామన్నారు. ఈ నెల 24 నాటికి సర్వే పూర్తవుతుందని చెప్పారు. ఆ తర్వాత ఉచిత విద్యుత్ మీటర్లు ఇచ్చి ప్రతీ ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పిస్తామని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 2,095 హేబిటేషన్లలో 13,600ల గృహాలకు విద్యుత్ సదుపాయం లేదని అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి నివేదికలు అందాయన్నారు. పట్టణాలతో సమానంగా గ్రామాల్లోనూ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే మరింత అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విశాఖను ఎంతో అభివృద్ధి చేశారని, మరింతగా అభివృద్ధి చేయాలంటే మళ్లీ ఆయన సీఎం కావాలని ఎంపీ, వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డులో వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభివృద్ధి పనుల వివరాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. విశాఖ కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు, వైద్య కేంద్రాలు, నాడు నేడులో భాగంగా పాఠశాలల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. రానున్న కాలంలో మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.